క్లుప్తంగా

అంతర్జాతీయ 'తైక్వాండో'లో క్రీడాకారుల ప్రతిభ



రేపల్లె రూరల్: అంతర్జాతీయ స్థాయిలో ఇటీవల మహారాష్ట్రలోని నాశిక్‌లో నిర్వహించిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తమ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చాటారని బోది ధర్మ తైక్వాండో అకాడమీ నిర్వాహకుడు, ఏపీ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విజేతల వివరాలు వెల్లడించారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాశిక్‌లో జరిగిన పోటీల్లో సైకం యువరాజ్ బంగారు పతకం, మాదవ్ రజతం, పీతా వెంకటకార్తికేయ, పీతా నాగ తనూష, అనన్య కాంస్య పతాకాలు సాధించారన్నారు.

మహాకవి గుర్రం జాషువాకు ఘన నివాళి



బాపట్ల అర్బన్: మహాకవి గుర్రం జాషువా తన కలంతో సమాజాభివృద్ధికి కృషి చేశారని ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు బండికళ్ల బాబురావు పేర్కొన్నారు. జాషువా 52వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఏబీఎం స్కూలు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఏలియా, చేగూరి మరియదాసు, రవి, మాల్యాద్రి పాల్గొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజు, పటాన్ రాజేష్, శంకర్‌రెడ్డి, కట్టాల లాజరస్, చింతా బాబురావు ఉన్నారు.

బూరుగులమ్మకు తామర పుష్పాలతో పూజలు



రేపల్లె రూరల్: గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి వేకువ జామునే సుప్రభాత సేవలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి 108 తామర పుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు వృద్ధిగా కురవటంతో పాటు పాడిపంటలతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుతూ తామరపువ్వులతో ప్రత్యే కపూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తెనాలిఅర్బన్: గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పొత్తూరులో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తెనాలి నెహ్రూనికేతన్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు (అండర్-12) విజేతలుగా నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. పోటీలకు ఎంపికైన షేక్ సుఫియానా బాషా, చామర్తి వర్షిత్, గాదెలవర్తి రాజు మధు, కాంద్రు అర్నవ్‌లను సోమవారం పాఠశాల ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిఅర్బన్: కేరళ వసంతలక్ష్మి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని వారి తండ్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు సహకారంతో నాజరుపేటలోని మనఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, పాదర్తి ఆదిలక్ష్మి, క్లబ్ సభ్యులు కోణిజేటి రమేష్ కృష్ణ, అయినాల మల్లేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు చుండూరు భారతి, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన యువకుడు ఏసుదాసుపై ఇటీవల కొందరు యువకులు దాడి చేశారు. దాడి సమయంలో చొప్పవరపు వెంకటేష్ అనే యువకుడు అక్కడే ఉన్నాడు. దీంతో ఏసుదాసు తన మిత్రులు భరత్, నానలతో కలిసి వెంకటేష్‌పై దాడి చేవాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

'వేమూరు' అభివృద్ధికి అధికారులు సహకరించాలి

- జిల్లా ఇన్‌చార్జి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- వేమూరు నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్షా సమావేశం
- పాల్గొన్న మంత్రి మేరుగ, కలెక్టర్ రంజిత్ బాషా



సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ, మంత్రి నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషా

వేమూరు: వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి అధికారులందరూ పూర్తిగా సహకారించాలని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో వేమూరు నియోజకవర్గం ప్రగతిపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, కలెక్టర్ రంజిత్ బాషాతో కలిసి ఆయన సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్అండ్ బీ, గృహ నిర్మాణ శాఖ, డీఆర్డీఏ, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించడం జరిగిందని తెలిపారు. రోడ్ల ఏర్పాటు కోసం నిధులు కేటాయించినట్లు చెప్పారు. త్వరలో పూర్తిగా రోడ్లు వేయనున్నట్లు ప్రకటించారు. అభివృద్ధి పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు.. కాంట్రాక్టర్లు రావడం లేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తిగా కావడం లేదని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి కొట్టు హెచ్చరించారు. వేమూరు నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సాంఘి సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రోడ్ల కోసం నిధులు కేటాయించిందని, వివిధ శాఖల అధికారులు త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులందరూ ఏం చేస్తున్నారో తనకు తెలుసునని మంత్రి మేరుగ పేర్కొన్నారు. కలెక్టరు రంజిత్ బాషా మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలో రెండు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మరలా పనులపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జేసీ శ్రీధర్, డీఆర్వో లక్ష్మీ శివజ్యోతి, ఆర్డీఓ పార్థసారథి, వివధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు త్వరితగతిన అందజేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద టిడ్కో గృహ లబ్ధిదారుల ధర్నా..

రేపల్లె: టిడ్కో గృహాల నిర్మాణ పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని టిడ్కో గృహాల సాధన కమిటీ నాయకులు పి.నాగాంజనేయులు, గొట్టుముక్కల బాలాజీ పేర్కొన్నారు. పట్టణంలో గత ఐదేళ్లుగా నిలిచిపోయిన టిడ్కో గృహాల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు, బాలాజీ మాట్లాడారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని టిడ్కో గృహాల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు దాసరి సాంబశివరావు, కె.వెంకట సుబ్బారావు, కొడాలి సాంబశివరావు, శ్రీరావమ్మ, ముసలయ్య, లంకా చంద్రశేఖర్, డి.ప్రకాశరావు, తలశిల సత్యనారాయణ, ఎం.కోటేశ్వరి, విజయ, బొలిశెట్టి సత్యనారాయణ, వసంత తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్ బాపట్ల'ను విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం : గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఈ నెల 28న గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, శ్మశాన వాటికలు తదిరత ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు ఒక మొక్క చొప్పున ఇచ్చి.. దానిని వారు 10వ తరగతికి వరకు సంరక్షించాల్సిన బాధ్యతను అప్పగించాలని తెలిపారు. మండలంలో మొత్తం 6,200 మొక్కలు నాటనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమం గురించి అన్ని గ్రామాల్లో గల ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించి, వారిని భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

అందుబాటులో ఎరువులు

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి చిర్రావుల సత్యానంద్ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. డీఏపీ-10, యూరియా-10, 20-20-0-13 కాంప్లెక్సు ఎరువులు-10 టన్నుల లెక్కన ఉన్నాయని తెలిపారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలని కోరారు. విచక్షణా రహితంగా ఎరువులు వినియోగించి, పొలాలను నిస్సారం చేయొద్దని సూచించారు. గతేడాది కౌలు కార్డులు 1090 మందికి ఇవ్వగా ఈ ఏడాది 1,890 మందికి ఇచ్చినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన వారు కార్డుల కోసం ఈ నెల 31వ తేదీలోపు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నేడు 'జగనన్న సురక్ష' క్యాంప్‌లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు-2, పల్లెకోన గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు జరుగుతాయని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'స్పందన'కు మూడు అర్జీలు

రేపల్లె రూరల్: స్పందనతో ప్రజలు తమ సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వివరాలు వెల్లడించారు. సర్వేకు రెండు అర్జీలు అందగా, పోలీసు శాఖలో నమోదు చేసిన ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని మొత్తం మూడు అర్జీలు అందాయన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పర్యవేక్షిస్తామని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉప్పల నారాయణస్వామి సతీమణి మంజులవాణి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ మండలం అంగలకుదురులో గల ముక్తి ట్రైబల్ రెసిడెన్స్ స్కూలులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు. హ్యాపీ హాస్పటల్స్ డాక్టర్ పావనీ ప్రియాంక, రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కొణిజేటి మురళి, కృష్ణకుమార్, ముక్తి స్కూల్ ఫాదర్ జయపాల్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, పూజిత, సతీష్, నందు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన

తెనాలి: ఏఐఎస్ఎఫ్, తెనాలి నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఈనెల 25న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందద్‌కు సంఘీభావంగా ఈ ప్రదర్శన చేశారు. విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యం సహకరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, మద్దినేని కిరణ్‌బాబు కోరారు. పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్, కావేటి యశ్వంత్, తలతోటి శ్రీను, వివ, వినయ్, కుప్పం సాయిప్రదీప్ పాల్గొన్నారు.

మదర్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం

తెనాలిఅర్బన్: వాసవీ క్లబ్, తెనాలిటౌన్ ఇస్కాన్ వారి సంయుక్త సహకారంతో పాత ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ (పిల్లలకు పాలు ఇచ్చు గది)ని సోమవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రీ ప్రారంభించారు.

రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి.
- రాష్ట్రంలో అత్యధికంగా కర్లపాలెంలో 10,262 ధ్రువీకరణ పత్రాల పంపిణీ



కర్లపాలెంలో ధ్రువీకరణ పత్రం అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా.. కర్లపాలెం గ్రామ పంచాయతీ 11 రకాల సేవలకు సంబంధించి 10,262 ధ్రువీకరణ పత్రాలు అందజేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కర్లపాలెంలోని స్థానిక పెద్దింటమ్మ కల్యాణ మండపంలో సోమవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోన రఘుపతి విచ్చేసి, అర్జీదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సచివాలయం సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు ఎమ్మెల్యే కోన రఘుపతి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో రాంబాబు, సర్పంచ్ నక్కా లలితకుమారి పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకిత భావంతో పని చేసి 10వేల మందికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించటం అభినందనీయమన్నారు. ఈ నాలుగేళ్ళలో వివిధ పథకాల కింద కర్లపాలెంలోని పంచాయతీ ప్రజలకు సుమారుగా రూ.46కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్ బాపట్లను జిల్లా కేంద్రం చేయటం వల్ల బాపట్లతో పాటు సమీపంలో ఉన్న కర్లపాలెం కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గణనీయంగా భూముల రేట్లు పెరగటంతో యజమానులకు లాభాలు వస్తాయన్నారు. ఒక్క కర్లపాలెం పంచాయతీలోనే జగనన్న కాలనీలో సుమారు 500ల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, వారందరికీ త్వరలోనే ప్రభుత్వం గృహాలు కూడా మంజూరు స్తుందని కోన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, హైమావతి, అమీర్‌బేగ్, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ ఆట్ల రామచంద్రారెడ్డి, నాయకులు కోకి రాఘవరెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, అహ్మద్ బాషా, డీపీవో దాసరి రాంబాబు, తహసీల్దారు కేశవ నారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని 22, 24 వార్డుల సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు సోమవారం నేతాజీ నగర్ సచివాలయ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. 1,100ల ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు అందజేశారు. వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు, కమిషనర్ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చోడాయపాలెం సచివాలయంలో నిర్వహించిన జగనన్నసురక్ష శిబిరంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, తహసీల్దారు మల్లికార్జునరావు, సర్పంచ్ మాతంగి రవి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు.



రేపల్లెలో ధ్రువపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

'జగనన్న సురక్ష'తో ప్రతి కుటుంబానికి మేలు

పెరవలి(వేమూరు): ప్రజలకు అన్ని విధాలా మేలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం అన్నారు. మండలంలోని పెరవలి గ్రామ సచివాలయం, పోతుమర్రు గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, దాది సుబ్బారావు, ఎంపీటీసీ దాది రజనీ, సర్పంచ్ కూచిపూడి మైనా, ఎంపీటీసీ ఈపూరు కుసుమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, దళిత నాయకులు

కర్లపాలెం: మణిపూర్ దళిత మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించి మాన, ప్రాణాలను తీసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పాస్టర్లు జోగి ప్రసంగి బోడా లాభాన్‌రాజు, కె.షడ్రక్ డిమాండ్ చేశారు. మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలంటూ సోమవారం మండల పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కర్లపాలెంలో దాస్ నగర్ నుంచి తహసీల్దారు కార్యలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. దోషులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కేశవ నారాయణరావుకు, ఏఎస్ఐ సాంబశివరావుకు వినతి పత్రాలు అందజేశారు. అమానుషమైన ఘటనలను అందరూ ఖండించాలని, శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సాల్మన్‌రాజు, రమేష్, ఏసయ్య, ఏసుబాబు, ఓబాద్య, ఏసురత్నం, బాబూరావు, చంటి, డేవిడ్, కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మోపర్తి జాన్, అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటిగా వర్షం..



పద్మావతి టాకీసు సెంటరులో రహదారిపై చేరిన వర్షపునీరు

రేపల్లె రూరల్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత రెండు రోజుల నుంచి తీరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో నియోజకవర్గంలో జనజీవనానికి అసౌకర్యం ఏర్పడింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వర్షపు నీరు నిలవటంతో వాహన చోదకులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలోని రేపల్లె పట్టణంలో అత్యధికంగా 58.4మి.మీలు వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా నిజాంపట్నంలో 26.4మి.మీలు వర్షపాతం నమోదయ్యింది. నగరం మండలంలో 50.4మి.మీలు చెరుకుపల్లి మండలంలో 47.6 మి.మీలు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వెద సాగు చేసిన రైతులు మొక్క దెబ్బతినేందుకు అవకాశం ఉంటుందని భయాందోళనలను చెందుతున్నారు.

'మణిపుర' దారుణాలతో గాయపడిన భారతదేశం ఆత్మ

- మూకదాడుల వెనుక లోతైన రాజకీయ కారణాలు
- ప్రముఖ హక్కుల కార్యకర్త, కథారచయిత్రి కత్తి పద్మ



తెనాలి: మణిపురలో జరిగిన దారుణంతో భారతదేశ ఆత్మ గాయపడిందని విశాఖకు చెందిన కథా రచయిత్రి, ×మహిళా చేతన≅ కత్తి పద్మ అన్నారు. మణిపురలో మూకదాడులు, మహిళల నగ్నపెరేడ్‌పై సిగ్గుపడాల్సింది ప్రజలు కాదు...పాలకులేనని, పార్లమెంటును ఎదుర్కోలేని ప్రధాని సిగ్గుపడాలని స్పష్టంచేశారు. దుర్మార్గ దాడులు చేసిన మూకలపై ఎలాంటి కఠినశిక్షలు తీసుకుంటారు? దేశప్రజలకు ఎలాంటి భరోసానిస్తారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. తన కథాసంపుటంపై చర్చావేదికలో పాల్గొనేందుకు తెనాలి వచ్చిన కత్తి పద్మ ×సాక్షి≅తో ప్రత్యేకంగా మాట్లాడిన అంశాలు ఆమె మాటల్లోనే...

■ అద్భుతమైన సౌందర్యం కలిగిన ఈశాన్య రాష్ట్రాలను పాలకులే మండుతున్న రావణకాష్టంలా మార్చివేశారు. సాయుధ బలగాల ప్రత్యేక చట్టం కారణంగా అక్కడ చాలా సమస్యలు తలెత్తాయి. ఆర్మీ చేసిన దురాగతాలను 12 మంది స్త్రీలు ×ఆర్మీ రేప్ అజ్≅ అంటూ బ్యానర్ పట్టుకుని సాయుధబలగాల క్యాంప్ ముందు నగ్నంగా ప్రదర్శన చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. మణిపుర నైసర్గికంగా కొండ, లోయలుగా ఉంటుంది. కొండలపై ఆదివాసీలైన కుకీ తెగవారు, వీరు దేశభక్తులు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అప్పట్లో ఆయుధాలతో పోరాడారు. లోయలోని మైతేయ్‌లు నిజానికి హిందూ వ్యతిరేకులు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవాన్ని మైతేయ్‌లు జరుపుకోరు. భారత జెండాను ఎగురవేయరు. తమ ఏడు వంశాలకు చెందిన జెండాను మాత్రమే ఎగురవేస్తారు.

■ మణిపురలో అశాంతికి 2015లో రాష్ట్ర అసెంబ్లీ తీసుకొచ్చిన మూడు బిల్లులు ప్రధాన కారణం. భూసంస్కరణల బిల్లు, పబ్లిక్ సేఫ్టీ, ఆర్గనైజేషన్స్ అండ్ షాప్స్ బిల్లుల్లో ఆదివాసీల ప్రాధాన్యతలను బాగా తగ్గించేశారు. రాజధాని ఇంఫాల్ ప్రాంతంలో యూనివర్శిటీలకు వెళ్లి, అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులుగా ఉన్న కుకీలపై దాడులు చేశారు. నర్సింగ్ కాలేజికి వెళ్లి, విద్యార్థినులను రోడ్డుపైకి లాగి కొరడాలతో కొట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పునరుద్ధరించాక వైరల్ అయిన ఒకేఒక వీడియో దేశాన్ని నిర్ఘాంతపరచింది. మూకదాడులకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ప్రజలకు ఏం భరోసానిస్తారు అనేది పార్లమెంటులోనే చెప్పాలి. ఇతర పార్టీల నేతలతో కలిసి ప్రధాని మణిపురలో పర్యటించాలి.

'పోస్టల్ డిపాజిట్లు' చెల్లింపులో జాప్యంపై ఫిర్యాదు



తహసీల్దారు కార్యాలయంలో సమస్యను వివరిస్తున్న డిపాజిట్‌దారులు

కొల్లూరు: పోస్టల్ డిపాజిట్లు గోల్‌మాల్ వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని డిపాజిటర్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గత నవంబర్‌లో మండలంలోని క్రాప పోస్టుమాస్టర్ శరత్ ఖాతాదారుల నగదుతో పరారయ్యాడని ఆరోపిస్తూ ఖాతాదారులు ఆందోళ చేశారు. పోస్టల్ శాఖాధికారులు విచారణ చేపట్టారు. కానీ, అప్పట్నుంచి నగదును తిరిగి జమ చేయకపోవడంతో ఈ నెల 17న క్రాపకు చెందిన ఖాతాదారులు కొల్లూరు పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేశారు. అయినా.. పోస్టల్ శాఖ అధికారుల నుంచి డిపాజిట్ నగదు తిరిగి చెల్లించే విషయంలో ఎటువంటి చర్యలు లేకపోవడంతో డిపాజిట్ చేసిన మహిళలు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. తొలుత కొల్లూరు పోస్టుమాస్టర్ మోహన్‌కు, పోలీసు స్టేషన్‌లో వేమూరు సీఐ వెంకటేశ్వరరావుకు, రెవెన్యు కార్యాలయంలో తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావుకు అర్జీలను అందజేశారు. కూలీనాలీ చేసుకుని పొదుపు చేసుకున్న సొమ్ములు తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళలు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ చిత్రీకరణ

తెనాలి: భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ బాబూజీ సినిమా రెండో షెడ్యూలులో సోమవారం చెంచుపేట ఆలపాటి నగర్‌లోని ఓ కల్యాణ మండపం ప్రాంగణంలో షూటింగ్ నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో జరిగిన ఒక సన్నివేశాన్ని దర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరించారు. ఈ సినిమాలో జగ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, లాల్‌బహదూర్ శాస్త్రిగాఉత్తరప్రదేశ్‌కు చెందిన అమీర్‌ఖాదరి నటించారు. జనవరిలో సినిమాను విడుదల చేస్తామన్నారు. విజయ్‌చంద్ర బోనెల నిర్మాత, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: దిలీప్‌రాజా.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు ఘన నివాళి



అయ్యంకి, పాతూరి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సభ్యులు

తెనాలి: గ్రంథాయల పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి, గ్రంథాలయోద్యమ ప్రముఖుడు కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం వర్ధంతిని సోమవారం స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్1 శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. ఇద్దరి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. విశ్రాంత గ్రంథపాలకుడు మొవ్వా సుబ్బారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకాలంలో పాతూరి నాగభూషణం బోటు గ్రంథాలయాలతో పాఠకులకు అమూల్యమైన గ్రంథాలను అందించి, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని కలిగించారని గుర్తుచేశారు. ఆలపాటి కళావతి రవీంద్రపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ స్వరాజ్య ఉద్యమకాలంలో గ్రంథాలయాల నిర్వహణలో ప్రముఖ పాత్రను పోషించారన్నారు. ఈ కార్యక్రజుమంలో లైబ్రేరియన్ కావూరి రమాదేవి, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.